ప్రజాశక్తి
మంగళవారం 29 నవంబర్ 2022
5
విజయనగరం

11న ఎపిఇపిడిసిఎల్ ఇసిసిఎస్ ఎన్నిక

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

ఎపిఇపిడిసిఎల్ శ్రీ వెంకటేశ్వర ఎంప్లాయిస్ కోపరేటివ్ క్రెడిట్ సొసైటీ లిమిటెడ్ సంఘ పాలకవర్గానికి వచ్చేనెల 11న ఎన్నిక జరుగనుందని సొసైటీ అధ్యక్షులు, ఎన్నికల అధికారి డిఆర్ఎస్ వరప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. డిసెంబర్ 1న ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటలు వరకు నామినేషన్ల స్వీకరణ, 2న పరిశీలన జరుగుతుందని తెలిపారు. 3వ తేదీ ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణ, అనంతరం పోటీలో ఉన్న అభ్యర్థుల ప్రకటన ఉంటుందని తెలిపారు. 11వ తేదీ సంఘ కార్యాలయంలో ఉదయం 7గంటల నుండి మధ్యాహ్నం 2గంటల వరకు పోలింగ్ జరుగుతుందని, అనంతరం ఓట్ల లెక్కింపు ఉంటుందని తెలిపారు. 13న ఆఫీసు బేరర్ల నియామకానికి ఎన్నిక జరుగుతుందని తెలిపారు.

60 వేల మందికి రూ.10.49 కోట్లు

రైతుల ఖాతాల్లో వడ్డీ రాయితీ జమ • పంట నష్టపోయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ విడుదల

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లాలోని రైతాంగానికి రాష్ట్ర ప్రభుత్వం ద్వారా వైఎస్ఆర్ సున్నా వడ్డీ పంట రుణాల పథకం కింద వడ్డీ రాయితీ నిధులను ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సోమవారం వీడియో కాన్ఫరెన్సు ద్వారా తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి సోమవారం విడుదల చేశారు. జిల్లాలో 2020 రబీ సీజనుకు సంబంధించి 9332 మంది రైతులకు రూ.1.318 కోట్లు, 2021 ఖరీఫ్ సీజనుకు సంబంధించి 28,190 మంది రైతులకు రూ.5,239 కోట్లు, వివిధ కారణాలతో గతంలో వడ్డీ రాయితీ నిధులు పొందలేకపోయిన 22,511మంది రైతులకు రూ.3.934కోట్లు నిధులు జమ చేశారు. జిల్లాలో మొత్తం 60,033 మంది రైతులకు 10.491కోట్ల నిధులు జమయ్యాయి.

ఈ ఏడాది అక్టోబరులో కురిసిన అకాల వర్షాల కారణంగా జరిగిన పంట నష్టాలకు పెట్టుబడి రాయితీ సొమ్మును కూడా ముఖ్యమంత్రి వర్చువల్ గా సోమవారం విడుదల చేశారు. జిల్లాలో 506 మంది రైతులకు రూ.17.51 లక్షల నిధులను ముఖ్యమంత్రి విడుదల చేశారు. కలెక్టర్ కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్సులో పాల్గొన్న అనంతరం జిల్లా పరిషత్ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్‌పి బెల్లాన చంద్రశేఖర్, కలెక్టర్ ఎ.సూర్యకుమారి తదితరులు జిల్లాలోని రైతులకు సున్నా వడ్డీ రాయితీ నిధులను, ఇన్ పుట్ సబ్సిడీ మొత్తాన్ని చెక్కు రూపంలో అందజేశారు.

సున్నావడ్డీ చెక్కు అందజేస్తున్న జెడ్‌పి ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, కలెక్టర్ సూర్యకుమారి

డిసిఎంఎస్ ఛైర్మన్ అవనాపు భావన, మాజీ ఛైర్మన్ సూర్యనారాయణరాజు, జిల్లా వ్యవసాయ అధికారి బి.టి.రామారావు, వ్యవసాయ శాఖ డిడి అన్నపూర్ణ, ఉద్యాన అధికారి జమదగ్ని, పలువురు రైతులు పాల్గొన్నారు.

రబీలో ఆరుతడి పంటలు మాత్రమే వెయ్యాలి

వచ్చే రబీ సీజనులో జిల్లాలోని సాగునీటి కాల్వల మరమ్మత్తులు, నిర్వహణ పనులను చేపడుతున్నందున పంట కాల్వల ద్వారా సాగునీటిని అందించడం సాధ్యం కాదని, జిల్లాలోని రైతులు దీన్ని గుర్తించి రబీలో ఆరుతడి పంటలు వేసుకోవాలని జెడ్‌పి ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు చెప్పారు. చెరువులు, బోర్ల ద్వారా రబీ పంటలకు సాగునీటిని అందించేలా రైతులు తమ వంతుగా ప్రయత్నాలు చేసుకోవాలన్నారు. మీడియాతో ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ఎన్‌సిఎస్ చక్కెర కర్మాగారం చెరకు రైతులకు బకాయిపడ్డ రూ.40 కోట్లను చెల్లించేలా చర్యలు చేపట్టామని పేర్కొన్నారు. జిల్లాలోని నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 3.75 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీటిని అందించేందుకు ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టును పూర్తిచేయాలని ముఖ్యమంత్రి కృతనిశ్చయంతో ఉన్నారని చెప్పారు. ఎమ్‌పి బెల్లాన చంద్రశేఖర్ మాట్లాడుతూ జిల్లాలో పంటకు మద్దతు ధర ప్రకటించి రైతుభరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేయించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోందన్నారు.

ఉపాధి కూలీలపై కందిరీగల దాడి

8 మందికి అస్వస్థత

ప్రజాశక్తి-రేగిడి

మండలంలోని కందిశ గ్రామంలో పండ్ల తోటల ట్రెంచ్ వర్క్ పనులు చేస్తున్న 8 మంది ఉపాధి కూలీలపై సోమవారం సాయంత్రం కందిరీగలు దాడి చేశాయి. దీంతో వారంతా అస్వస్థతకు గురయ్యారు. ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ ఎపిఒ సంకాబత్తుల హరినాధకు సమాచారం అందించారు.. వెంటనే స్పందించి 108 వాహనం ద్వారా రాజాం ఏరియా ఆసుపత్రికి మెరుగైన వైద్యం కోసం తరలించారు.. ఎపిడి రాధ, ఎపిఎం సంకాబత్తుల హరినాథ్ పరామర్శించారు. వైద్య చికిత్సపై ఎపిడి ఆరా తీశారు. వీరితోపాటు టెక్నికల్ అసిస్టెంట్లు భారతి గురయ్యారు.

ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కూలీలు

ఆర్‌డిఒ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న వ్యకాస నాయకులు, దళితులు

భూ ఆక్రమణలపై దర్యాప్తు చేయాలని ధర్నా

ప్రజాశక్తి-బొబ్బిలి

రామభద్రపురం మండలం కొండకెంగువ రెవెన్యూలో భూ ఆక్రమణలపై సమగ్ర దర్యాప్తు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గొర్లె శ్రీనివాస్ డిమాండ్ చేశారు. కొండకెంగువలో భూ అక్రమాలపై దర్యాప్తు చేయాలని సోమవారం ఆర్‌డిఒ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొండకెంగువ రెవెన్యూలో ఎన్నో ఏళ్ల నుంచి దళితులు భూమి సాగు చేసుకుని జీవనోపాధి పొందుతున్నారని, ఆయా భూముల రికార్డులను పెత్తందారులు మార్చివేసి అమ్మకాలు చేపడుతున్నారని తెలిపారు. దళితుల భూములను ఒక ఎన్ఆర్ఐ కొనుగోలు చేశారన్నారు. తక్షణమే భూ అక్రమాలపై దర్యాప్తు చేసి దళితులకు న్యాయం చేయాలని కోరారు. భూమిని సాగు చేస్తున్న దళితులకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్‌డిఒ శేషశైలజకు వినతిపత్రం అందజేశారు. భూములపై సమగ్ర దర్యాప్తు చేసి చర్యలు తీసుకుంటామని ఆర్‌డిఒ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు పి.శంకరరావు, ఎస్.గోపాలం, బి.శ్రీనివాసరావు, దళితులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఓటర్ల జాబితాలో తప్పులను సరిచేయాలి

బొబ్బిలి : ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్ల జాబితాలో తప్పులను సరి చేయాలని ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్లు, ప్రజాసంఘాల ఐక్యవేదిక కన్వీనర్ కె.విజయగౌరి, కో.కన్వీనర్లు పి.శంకరరావు, వి.ప్రసన్నకుమార్ డిమాండ్ చేశారు. ఎన్నికల సంఘం తాజాగా విడుదల చేసిన ఓటర్ల జాబితాలో తప్పులు ఉన్నాయన్నారు. గ్రాడ్యుయేషన్, డిగ్రీ విద్యార్హత లేని వారికి కూడా ఓటర్ల జాబితాలో ఓటు ఉందని, అర్హత ఉన్నవారికి ఓటు ఉన్నప్పటికీ విద్యార్హత పేర్కొనలేదని చెప్పారు. ఓటర్ల జాబితాలో తప్పులను సరిచేసి బోగస్ ఓట్లను రద్దు చేయాలని అధికారులను కోరారు. ఓటర్ల జాబితాపై సమగ్ర దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు. లేనిచో ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేస్తామన్నారు.

వినతుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

వికలాంగులకు రూ.49 లక్షలు రుణాలు : కలెక్టర్

ప్రజాశక్తి-విజయనగరం

వినతుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ ఎ.సూర్యకుమారి తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందనకు ప్రజల నుంచి 157 వినతులు అందాయి. వీటిలో వైద్యశాఖకు 37, డిఆర్‌డిఎకు 2, హౌసింగ్‌కు 12, మున్సిపల్ శాఖకు 1, ఇతర శాఖలకు సంబంధించి 8, అదనంగా అత్యధికంగా రెవిన్యూ కు సంబంధించి 97 వినతులు అందాయి. ముఖ్యంగా సదరం, పింఛన్లు, ఇళ్ల స్థలాలు, భూ సమస్యలు, గృహాల కోసం విజ్ఞప్తులు వచ్చాయి. కలెక్టరు ఎ. సూర్య కుమారి, జెసి మయూర్ అశోక్, డిఆర్ఒ గణపతిరావు, ఉప కలెక్టర్లు సుదర్శన దొర, సూర్యనారాయణ స్వీకరించారు. అనంతరం అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ రీ ఓపెన్ వినతుల అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. దరఖాస్తుదరులతో మాట్లాడిన తర్వాతనే డిస్పోజ్ చేయాలనీ ఆదేశించారు. ఫోటోలను తప్పకుండా అప్ లోడ్ చేయాలన్నారు. నిర్దేశిత గడువులోగా రీ ఓపెన్ దరఖాస్తులను పరిష్కరించక పోతే తర్వాత డిస్పోజ్ చేయడానికి కుదరదని తెలిపారు.

అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ సూర్యకుమారి

చెక్కుల అందజేత

జిల్లాకు చెందిన 21 మంది వికలాంగులకు రూ.49.05 లక్షల విలువైన చెక్కులను స్పందన కార్యక్రమంలో కలెక్టర్ సూర్యకుమారి అందజేశారు.

అభ్యాసనాభివృద్ధి కార్యక్రమం ప్రారంభం

విజయనగరం టౌన్ : అభ్యసనాభివృద్ధి కార్యక్రమాన్ని జిల్లా విద్యాశాఖ అధికారి బి.లింగేశ్వరరెడ్డి సోమవారం స్థానిక కస్పా హైస్కూలులో ప్రారంభించారు. ప్రధానంగా 6,7,8 తరగతుల విద్యార్థులకు అభ్యసన సామర్థ్యాలను పెంపొందించేందుకు ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందన్నారు. ప్రధానంగా విద్యార్థులకు రాయడం, చదవడం, అభ్యసన సామర్థ్యాన్ని పెంచడం కోసం, విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ పెట్టడం వంటి అంశాలపై ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తామన్నారు. అనంతరం సబ్జెక్ట్ మెటీరియల్‌ను ఆవిష్కరించారు. డైట్ ప్రిన్సిపాల్ నల్ల తిరుపతి నాయుడు, డిప్యూటీ డిఇఒ వాసుదేవరావు, విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

ఆర్‌బికెలే ధాన్యం కొనుగోలు కేంద్రాలు

జెసి మయూర్ అశోక్

ప్రజాశక్తి-విజయనగరం

రైతులు పండించిన ధాన్యం కొనుగోలు చేసేందుకు స్థానికంగా ఉన్న రైతు భరోసా కేంద్రాల్లోనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని, దీనిపై ఎవరికి ఎలాంటి సందేహమూ అవసరం లేదని జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ స్పష్టంచేశారు. రైతులు పండించిన ప్రతి గింజా కొంటామన్నారు. ఖరీఫ్ ధాన్యం కొనుగోలుకు సంబంధించి జిల్లాలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు, బ్యాంకుల ప్రతినిధులు, ఆయా శాఖల అధికారులతో సోమవారం ఆయన కలెక్టరేట్ సమావేశ మందిరంలో సమావేశమయ్యారు. కొనుగోలు ప్రక్రియలో అనుసరించాల్సిన విధానాల గురించి, మారిన నిబంధనల గురించి వివరించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందీ లేకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా సాగాలని, దీనికి అందరూ సహకరించాలని జెసి విజ్ఞప్తి చేశారు.

సమావేశంలో భాగంగా పలువురు పిఎసిఎస్‌ల ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు గోనె సంచుల కొరత గురించి, రవాణా ఛార్జీల గురించి ప్రస్తావించారు. గతంలో నిలిచిపోయిన బకాయిలను చెల్లించాలని కోరారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో తలెత్తే సమస్యల గురించి జెసి ముందు ప్రస్తావించారు. స్పందించిన జెసి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. గోనె సంచుల కొరత రాకుండా తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. దూరాన్ని బట్టి రవాణా ఛార్జీలు చెల్లిస్తామని, హమాలీల కూలి కూడా నిబంధనల ప్రకారం చెల్లిస్తామని స్పష్టం చేశారు. సమావేశంలో డిసిఒ రమేశ్, డిసిసిబి డిఎం జనార్ధనరావు, సివిల్ సప్లై డిఎం మీనాకుమారి, డిఎస్ఒ సుదర్శనరావు, తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జెసి మయూర్ అశోక్

ధాన్యం కొనాలని వినతి

విజయనగరం టౌన్ : జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను వెంటనే ప్రారంభించి దళారుల నుంచి నష్టపోకుండా రైతులను ఆదుకోవాలని ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి బి.రాంబాబు, చొక్కాపు సూర్యనారాయణ జిల్లా జాయింట్ కలెక్టర్‌కు సోమవారం వినతి అందజేశారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ జిల్లాలో గత 15 రోజుల నుంచి వరి కోతలు చేస్తూ ధాన్యం నూర్పులు చేసి కొనుగోలు కేంద్రాలకు తరలించడానికి రైతులు ఎదురు చూస్తున్నప్పటికీ ఆర్‌బికెల్లో ప్రక్రియ ప్రారంభం కాలేదని అన్నారు. ఆలస్యమైన కొద్దీ ఒకేసారి నూర్పిళ్లు వల్ల పెట్టుబడి ఖర్చు పెరిగిపోతుందని తెలిపారు. ఇప్పటికే దళారులు ప్రవేశించి క్వింటా రూ.1750 చొప్పున కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. దళారుల వల్ల క్వింటాకు రూ.300 చొప్పున ఎకరా వద్ద రైతులు రూ.7వేలు నష్టపోతున్నారని తెలిపారు. వెంటనే ఆర్‌బికెలో కొనుగోలు ప్రక్రియ ప్రారంభించాలని, ఈ-కర్షక్‌లో నమోదు కానీ రైతులు, కౌలురైతులు ధాన్యం కొనుగోలుకు ప్రత్యామ్నాయం ఏర్పాటు చేయాలని కోరారు. బొబ్బిలి మండలంలోని పలు గ్రామాల్లో చెరకు కటింగ్ ఆర్డర్లు ఒక విధానం లేకున్నా ఇవ్వడం, దళారులతో ప్యారీసుగర్స్ సంకిలి యాజమాన్యం రైతులకు నష్టం చేసే విధంగా వ్యవహరిస్తున్నందున తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

యువజన పురస్కారానికి దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి-విజయనగరం

సామాజిక, సేవా రంగాల్లో చేసిన కృషికి కేంద్ర ప్రభుత్వం 2022-23 సంవత్సరంలో అందించే జిల్లాస్థాయి ఉత్తమ యువజన పురస్కారానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా యువజన అధికారి జి.విక్రమాదిత్య సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆరోగ్యం, పరిశోధన, ఆవిష్కరణ, సంస్కృతి, మానవ హక్కుల ప్రోత్సాహం, కళలు, సాహిత్యం, పర్యాటక, క్రియాశీల పౌరసత్వం, సమాజ సేవ, క్రీడలు, అకడమిక్ ఎక్సలెన్స్, స్మార్ట్ లెర్నింగ్ వంటి అంశాల్లో సేవలందిస్తున్న యువతీ, యువకులు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. 2021-2022 సంవత్సరాలకు గాను నామినేషన్లు ఈనెల 26నుంచి డిసెంబర్ 12 వరకు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. వివిధ విభాగాల్లో సేవలందించిన యువతీ, యువకుల స్వచ్ఛంద సేవా సంస్థల నిర్వాహకులు వారు చేసిన సేవా కార్యక్రమాల ఫోటోలు, పత్రికల్లో ప్రచురితమైన వివరాలను నివేదిక రూపంలో జిల్లా యువజన అధికారి కార్యాలయంలో నేరుగా లేదా పోస్ట్ ద్వారా డిసెంబర్ 12వ తేదీలోగా పంపించవచ్చని వివరించారు. ఎంపికైన సంఘానికి రూ.25 వేలు నగదు, ప్రశంసా పత్రం అందజేయనున్నట్లు తెలిపారు. ఇతర వివరాలకు 08922 274471, 90009 30777 నంబర్లను సంప్రదించాలని పేర్కొన్నారు.

బీచ్ ఇసుక తరలింపు

అడ్డుకున్న అటవీశాఖ సిబ్బంది

ప్రజాశక్తి - పూసపాటిరేగ

మండలంలోని అక్రమంగా తరలిస్తున్న సముద్రం ఇసుకను సోమవారం అటవీ శాఖ అధికారులు అడ్డుకున్నారు. నలుగురు ఫారెస్ట్ సెక్షన్ అధికారులు, నలుగురు బీట్ అధికారులు బృందంగా ఏర్పడి మాటు వేసి పట్టుకున్నారు. గత కొన్ని నెలలుగా తీరంలోని సముద్రపు ఇసుకను తరలిస్తున్నారన్న సమాచారం మేరకు అటవీ శాఖ అధికారులు నిఘా పెట్టారు. దీనిలో భాగంగా సోమవారం గుట్టు చప్పుడు కాకుండా టిప్పర్‌తో తరలిస్తున్న సముద్రపు నల్ల ఇసుకను అటవీ శాఖ అధికారులు చాకచక్యంగా వ్యవహరించి దాడులు చేసి పట్టుకుని టిప్పర్‌ను స్వాధీనం చేసుకున్నారు. టిప్పర్ డ్రైవర్, క్లీనర్ అక్కడ నుండి పరారైనట్లు అధికారులు తెలిపారు. గ్రామంలోని కొందరు స్థానికుల సహకారంతోనే పెద్ద ఎత్తున నల్ల ఇసుక తరలితుందనే విమర్శలు ఉన్నాయి. సుమారు 9 క్యూబిక్ మీటర్ల నల్ల ఇసుకను స్వాధీనం చేసుకున్నారు. దాడులు చేసిన వారిలో ఫారెస్ట్ సెక్షన్ అధికారులు మధుమోహనరావు, రామకృష్ణ, సింహాద్రి, రాజు, బీట్ అధికారులు పూజా, ప్రసాద్, తదితరులు ఉన్నారు.

స్వాధీనం చేసుకున్న సముద్రపు ఇసుక

లింగ వివక్షతకు వ్యతిరేకంగా ప్రచారం

విజయనగరం : లింగ ఆధారిత వివక్షతకు వ్యతిరేకంగా అవగాహనా కార్యక్రమాలను నిర్వహించాలని కలెక్టర్ ఎ.సూర్యకుమారి ఆదేశించారు. జాతీయ స్థాయి ప్రచార కార్యక్రమంపై, తన ఛాంబర్‌లో సోమవారం సమీక్ష నిర్వహించారు. కార్యక్రమానికి సంబంధించిన అంశాలను, డిఆర్‌డిఎ పీడీ ఎ.కల్యాణ చక్రవర్తి వివరించారు. కలెక్టర్ సూర్యకుమారి మాట్లాడుతూ లింగ వివక్షతను, అసమానత్వ సమస్యలను ఎదుర్కొనడం, నిర్మాణాత్మక వ్యూహాలను అనుసరించేందుకు డిసెంబరు 23 వరకు పెద్ద ఎత్తున ప్రచార కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జిల్లా స్థాయిలోనే కాకుండా, మండల స్థాయిలో కూడా అవగాహనా శిబిరాలను నిర్వహించాలన్నారు. సమావేశంలో బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ జిల్లా ఛైర్మన్ జి.హిమబిందు, జెడ్‌పి సిఇఒ ఎం.అశోక్‌కుమార్, సిపిఒ పి.బాలాజీ, ఐసిడిఎస్ పీడీ బి.శాంతకుమారి, మెప్మా పీడీ సుధాకరరావు, డిఆర్‌డిఎ ఎపిడి సావిత్రి, అధికారులు, డిఆర్‌డిఎ సిబ్బంది పాల్గొన్నారు.



గరివిడిలో ఎల్ఐసి కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న ఏజెంట్లు

ఎల్ఐసి ఏజెంట్ల ఆందోళన

ప్రజాశక్తి- గరివిడి

ఎల్ఐసి ఏజెంట్ల వ్యవస్థను నిర్వీర్యం చేసే విధానాలను, అమలు చేసే ఆలోచన విరమించుకోవాలని గరివిడి ఎల్ఐసి బ్రాంచ్ కార్యాలయం వద్ద ఏజెంట్లు సోమవారం ఆందోళన వ్యక్తం చేశారు. ఏజెంట్స్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా పిలుపుమేరకు విశాఖ డివిజన్ అధ్యక్షుడు ఆల్తి వేణు ఆధ్వర్యంలో ఇక్కడి కార్యాలయంలో ఆందోళన నిర్వహించారు. డైరెక్ట్ మార్కెటింగ్ విధానం నిలుపుదల చేయాలని, ఏజెంట్ల ఇతర సమస్యలను పరిష్కరించాలని ఈ సందర్భంగా నినాదాలు చేశారు. ఏజెంట్ల వృత్తి ఉపాధికి నష్టం కలిగించే విధానాలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. డిసెంబర్ 9వ తేదీన హైదరాబాదులోని ఐఆర్‌డిఎ కార్యాలయం వద్ద నిర్వహించ తలపెట్టిన ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో బ్రాంచ్ కార్యదర్శి ఎం.ఎల్లంనాయుడు, సీనియర్ యూనియన్ ప్రతినిధులు రౌతు నారాయణరావు, గేదెల రామారావు, కుమిలి నాగేశ్వరరావు, రెసిడెంట్ కార్యదర్శి ఎం హరీష్ కుమార్, కోశాధికారి సిహెచ్ రామకృష్ణ పాల్గొన్నారు.

వంగర: కేంద్ర ప్రభుత్వం ఎల్ఐసిలో ఏజెంట్లకు నష్టం కలిగించే జీవన సుగం బీమా యాప్‌ను తక్షణమే రద్దు చేసి, ఎల్ఐసిని పరిరక్షించాలనీ కోరుతూ రాజాం ఎల్ఐసి బ్రాంచ్ వద్ద జరిగిన ధర్నాలో వక్తల డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సిఐటియు జిల్లా కార్యదర్శి సిహెచ్ రామ్మూర్తి నాయుడు మాట్లాడుతూ బీమా రంగంలో అన్ని లావాదేవీలపై జిఎస్‌టిని నివారించాలన్నారు. ఈ కార్యక్రమంలో స్టాఫ్ యూనియన్ నాయకులు ప్రభాకర్, తిరుపతిరావు, డెవలప్మెంట్ ఆఫీసర్స్ యూనియన్ నాయకులు దేవానంద్, గణనాధ ఏజెంట్ యూనియన్ నాయకులు వై రాము, శ్రీరాములు, నరసింహ, మన్మధరావు తదితరులు పాల్గొన్నారు.

విజయమే లక్ష్యంగా కృషి చేయాలి

విజయనగరంటౌన్ : ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల ముందుకు తీసుకువెళ్లి పార్టీ విజయమే లక్ష్యంగా కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక విఆర్ గ్రాండ్ లో జోనల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పార్టీ నియమావళి పుస్తకాలను నాయకులకు అందించారు. సీనియర్ కార్పొరేటర్ కేదారి శెట్టి సీతారామమూర్తి అధ్యక్షతన జరిగిన సమావేశంలో కోలగట్ల మాట్లాడారు. కార్యకర్తలను ఏ సందర్భంలోనూ విస్మరించరాదని నాయకులకు సూచించారు. వైసిపి నగర అధ్యక్షుడు ఆశపు వేణు, రాష్ట్ర పరిశ్రమల అభివృద్ధి మండలి డైరెక్టర్ బంగారు నాయుడు, బోడసింగి ఈశ్వరరావు, కార్పొరేటర్లు బవిరెడ్డి సతీష్, నడిపల్లి ఆదినారాయణ, ఆశపు సుజాత, పిల్లా రాధా భవాని, గవర కార్పొరేషన్ డైరెక్టర్ ఆడాకి రుక్మిణీ, కణుగుల రాజా, ఎడ్ల రాజేష్, గార సత్యనారాయణ, పార్టీ డివిజన్ అధ్యక్షులు పాల్గొన్నారు.

భావితరాలకు ఆదర్శప్రాయం.. పూలే

పూలే విగ్రహానికి పూలమాల వేస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

బిసిల అభ్యున్నతికి జ్యోతిరావు పూలే చేసిన ఎనలేని కృషి భావితరాలకు ఆదర్శప్రాయం అని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి అన్నారు. సోమవారం జ్యోతిరావు పూలే 132వ వర్థంతిని పురస్కరించుకుని స్థానిక కలెక్టరేట్ ప్రాంతంలో ఉన్న పూలే జంక్షన్లో జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. వైసిపి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని పూలే సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి మాట్లాడుతూ మహాత్మా జ్యోతిరావు పూలే వర్ధంతిని పురస్కరించుకుని నివాళులు అర్పించడంతోపాటు ఆయన ఆశయ సాధనకు కట్టుబడి ఉన్నామని అన్నారు. దేశ తొలి ఉపాధ్యాయురాలుగా సావిత్రిబాయి పూలే విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ ప్రాంతాన్ని అభివద్ధి చేసి జనవరి 3న సావిత్రిబాయి పూలే విగ్రహాన్ని ఆవిష్కరించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో డిఆర్ఒ ఎం.గణపతిరావు, బిసి సంఘం నాయకులు ముద్దాడ మధు, వైసిపి నగర అధ్యక్షులు ఆశపు వేణు, డాక్టర్ వి.ఎస్. ప్రసాద్ పాల్గొన్నారు.

విజయనగరం : బిసిలంతా ఉన్నత చదువులు చదివి, ఉన్నత పదవులు పొంది బిసి అనే ముద్రను చెరిపివేయాలని జిల్లా కలెక్టర్ ఎ. సూర్య కుమారి పిలుపునిచ్చారు. కలెక్టరేట్ ఆడిటోరియంలో పూలే చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ బిసికులాల వారి ఉన్నత చదువుల కోసం ఒక ట్రస్ట్ ద్వారా ప్రయత్నం చేయాలని కోరారు. పై చదువులు చదువుకోలేని వారు డిగ్రీ పూర్తి కాగానే ఉద్యోగాల కోసం వెతుకుతున్నారని, అలా కాకుండా ట్రస్ట్ ద్వారా చేయూతను ఇవ్వాలని అన్నారు. బిసి హాస్టల్ శాశ్వత భవనం కావాలని బిసి ప్రతినిధులు కోరగా నాడు-నేడు కింద పాఠశాలల నిర్మాణాలు పూర్తయిన వెంటనే హాస్టల్ భవనాలకు కూడా ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. కార్యక్రమంలో జెసి మయూర్ అశోక్, డిఆర్ఒ గణపతి రావు, డిబిసిడబ్ల్యూ యశోధన రావు, బిసి ప్రతినిధులు డివి చారి, గొంప అప్పల రాజు, ముద్దాడ మధు, ఎలిగాపు విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జనసేన పార్టీ నాయకులు ఆదాడ మోహనరావు, త్యాడ రామకృష్ణారావు, పొట్నూరు చందు, రవితేజ తదితరులు పూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

విజయనగరం కోట : కలెక్టరేట్ వద్ద పూలే విగ్రమానికి టిడిపి నాయకులు పూమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టిడిపి నగర అధ్యక్షులు లక్ష్మీ వరప్రసాద్, మండల అధ్యక్షులు బొద్దల నర్సింగరావు, కంది మురళీ నాయుడు, కె.మురళీమోహన్, కె.నర్సింగరావు పాల్గొన్నారు.

శృంగవరపుకోట: స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో పూలే చిత్రపటానికి ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి సండి సోమేశ్వరరావు, జెడ్‌పిటిసి సభ్యులు మమ్ములూరి వెంకటలక్ష్మి, వైస్ ఎంపిపిలు ఇందుకూరి సుధారాజు, పిన్నింటి వెంకటరమణ పాల్గొన్నారు.

వేపాడ : వల్లంపూడి కూడలి జ్యోతిరావు పూలే చిత్రపటానికి మండల దళిత మహాసభ అధ్యక్షులు కొమనాపల్లి రాము పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గుత్తి శీను, కొమనాపల్లి పార్వతి, లక్ష్మి, బి.పార్వతి, సత్యవతి రాములమ్మ, అప్పలకొండ, జవార్ పాల్గొన్నారు.

డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

గరివిడి : చీపురుపల్లి పట్టణంలోని జ్యోతిరావు పూలే విగ్రహానికి జిల్లా పరిషత్ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్‌పి బెల్లాన చంద్రశేఖర్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి కెవి. సూర్యనారాయణ రాజు, ఎంపిపి ఇప్పిలి వెంకట నరసమ్మ, జెడ్‌పిటిసి వల్లిరెడ్డి శిరీష, గరివిడి ఎంపిపి మీసాల విజయలక్ష్మి, జెడ్‌పిటిసి వాకాడ శ్రీనివాసరావు, మండల నాయకులు ఇప్పిలి అనంత్, వల్లిరెడ్డి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

డెంకాడ: మండలంలోని మోపాడ గ్రామ సచివాలయంలో పూలే చిత్రపటానికి ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపిపి బంటుపల్లి వాసుదేవరావు, పూసపాటి రేగ మండల వైసిపి అధ్యక్షులు పతివాడ అప్పలనాయుడు, వైస్ ఎంపిపి పిన్నింటి తమ్మినాయుడు పాల్గొన్నారు.

రేగిడి: ఎంఆర్‌సి కార్యాలయంలో పూలే విగ్రహానికి ఎంఇఒ ఎం. వరప్రసాద్ పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంఐఎస్ కోఆర్డినేటర్ కె శ్రీనివాసరావు, సిఆర్పిలు కెంబూరు వెంకటరమణ, చంద్రరావు, కృష్ణ, మోహన్ రావు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రూ.216 కోట్లతో ఇంటింటికీ కుళాయి

ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-శృంగవరపుకోట

నియోజకవర్గంలో జల్ జీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేసేందుకు రూ.216 కోట్లు మంజూరయ్యాయని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపిపి సండి సోమేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. శృంగవరపుకోట మండలానికి జెజెఎం నిధులు రూ.112 కోట్లు మంజూరైనట్లు చెప్పారు. సచివాలయ సిబ్బంది సక్రమంగా పనిచేయడం లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. అనంతరం ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు మాట్లాడుతూ మండల సర్వసభ్య సమావేశానికి కొన్ని శాఖల అధికారులు హాజరు కావడం లేదన్నారు. పోలీస్ శాఖ మరీ నిర్లక్ష్యంగా పనిచేస్తోందని, ఫోన్ చేసినా స్పందించడం లేదని చెప్పారు. పోలీసులే గంజాయిని తరలించి, వారికి వ్యతిరేకంగా ఉన్న వారి ఇళ్లల్లో వేస్తున్నారంటే పోలీసులు ఎంత బాధ్యతా రాహిత్యంగా ప్రవర్తిస్తున్నారో తేటతెల్లమవుతుందని మండిపడ్డారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

పోలీసుల పనితీరుపై ఎంపిడిఒ కార్యాలయంలో గ్రీవెన్స్ నిర్వహిస్తామని, ఎవరైనా ఫిర్యాదు చేయవచ్చునని చెప్పారు. మండలంలోని విద్యాశాఖ పనితీరుపై ఎంఇఒ సత్యనారాయణ వివరణ ఇచ్చారు.

గ్రామాలలో చెత్త పన్ను వసూలు చేసి గ్రీన్ అంబాసిడర్లకి జీతాలు కింద ఇవ్వాలన్న ఎమ్మెల్సీ వాదనను సర్పంచులు వ్యతిరేకించారు. చెత్త పన్నుతో సంబంధం లేకుండా రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ అంబాసిడర్లకు జీతాలు చెల్లించాలని వారు కోరారు. గ్రామాలలో సర్వేల పేరుతో వీఆర్‌ఓలు ప్రజలకు అందుబాటులో లేకుండా తప్పించుకొని తిరుగుతున్నారని సర్పంచులు ఫిర్యాదుచేశారు.

ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు మమ్ములూరి వెంకటలక్ష్మి, వైస్ ఎంపిపిలు ఇందుకూరి సుధారాజు, పిన్నింటి వెంకటరమణ, ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ సత్యశేఖర్, మండల వ్యవసాయ అధికారి ధర్మేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

స్తంభాలకు కనెక్షన్ ఇవ్వాలని వినతి

బొబ్బిలి : గొల్లపల్లి దాడిపల్లి కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన విద్యుత్తు స్తంభాలకు వైర్లు ఏర్పాటు చేయాలని కౌన్సిలర్ కాకల వెంకటరావు కోరారు. విద్యుత్ వైర్లు ఏర్పాటు చేయాలని సోమవారం మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు, విద్యుత్ శాఖ ఇఇ పూడి హరికి వినతిపత్రం అందజేశారు. స్తంభాలు ఏర్పాటు చేసి నెలలు గడుస్తున్నా వైర్లు ఏర్పాటు చేయకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు.

దేవాసికి సన్మానం

శృంగవరపుకోట : రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీల్లో సిల్వర్ పతకం సాధించిన మాదారం దేవాసిని సోమవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు సన్మానించారు. పట్టణంలోని ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద స్వీటు దుకాణంలో కార్మికుడిగా పనిచేస్తున్న మాదారం దేవాసి బతుకు తెరువు కోసం రాజస్థాన్ నుంచి ఎస్.కోట వలస వచ్చాడు. కార్యక్రమంలో ఎంపిపి సండి సోమేశ్వరావు, వైస్ ఎంపిపి పినిశెట్టి రమణ, వైసిపి నాయకులు సేనాపతి వెంకటప్పు, మజ్జి గంగరాజు, భూశారం చౌదరి, దేవి సింగ్ కేతన్ మాలి, అశోక్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఫిజియోథెరపీతో సత్ఫలితాలు

రామభద్రపురం : వికలాంగులకు ఫిజియోథెరపీతో సత్ఫలితాలు సాధించవచ్చని ఎంఇఒ ఎ.తిరుమల ప్రసాద్ తెలిపారు. సోమవారం స్థానిక భవిత కేంద్రంలో వికలాంగులకు ఫిజియో థెరపీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పక్షవాతం, ప్రమాదాలకు గురైనవారు, ఎముకలు, నరాల సంబంధ వ్యాధులున్న వారికి మందులతో నయం కానిది కూడా ఫిజియోథెరపీ వల్ల నయమవుతాయని చెప్పారు. కార్యక్రమంలో ఫిజియోథెరపిస్ట్ బి.యామిని, ఐఆర్‌పి చింతల రాజేశ్వరి, బి.అచ్యుతరావు పాల్గొన్నారు.

'కుమిలిలో బెల్టుషాపులు నడపడం అవాస్తవం'

పూసపాటిరేగ : మండలంలోని కుమిలి గ్రామంలో కీలక నేతల ఆధ్వర్యంలో 16 బెల్టు దుకాణాలు నిర్వహణ జరుగుతుందని టివి న్యూస్‌లో వచ్చిన వార్తలు అవాస్తవమని కుమిలి ఉప సర్పంచ్ గుజ్జు సురేష్‌రెడ్డి తెలిపారు. ఆదివారం కుమిలి గ్రామంలో బెల్టు దుకాణాలు నిర్వహణపై వచ్చిన టివి న్యూస్‌పై ఆయన స్పందించారు. వైకాపా నేతలు, కీలక నేతలు అని చెప్పడం కాదని. తామే బెల్టు దుకాణాలను ప్రోత్సహిస్తున్నామని రుజువు చేయగలిగితే రాజకీయ సన్యాసం తీసుకుంటామని తెలిపారు. లేని పోని ఆరోపణలు చేస్తూ తమ ప్రతిష్టను దిగజార్చే న్యూస్ వేస్తే కోర్టును ఆశ్రయిస్తామని హెచ్చరించారు. ఈ విషయమై పెద్దల దృష్టికి తీసుకువెళ్లి చట్ట రీత్యా చర్యలు చేపడతామన్నారు.

నాయకత్వ లక్షణాలు అవసరం

పూసపాటిరేగ : విద్యార్థి దశలోనే నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలని తహశీల్దార్ ఐ. బాస్కరావు తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని ఎస్‌వివిఎస్‌ఆర్ డిగ్రీ కళాశాలలో ఓటర్ నమోదు అనే అంశంపై విద్యార్థులకు వ్యాస రచన పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో ఎంపికైన చెందిన ఇరువురి జగదీష్, పవాల శాంతకు ప్రథమ, ద్వితీయ బహుమతులను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశలోనే ఎన్నికలు, నాయకత్వం, ఓటర్ నమోదు తదితర అంశాలపై దృష్టి పెట్టాలన్నారు. ఆయనతో పాటు ప్రిన్సిపాల్ పి. పైడిరాజు, అధ్యాపకులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రిసోర్స్ పర్సన్ రాజారాం

ఎంవిజిఆర్‌లో క్రియేటివ్ టాక్ సెషన్

డెంకాడ : ప్రాజెక్ట్ సేతు 2022లో భాగంగా, ఎఫ్.వై.ఎఫ్.పీ- ఎం.వి.జి.ఆర్ యూనిట్ అండ్ ఇన్స్టిట్యూట్ ఇన్నోవేషన్ సెల్ సంయుక్తంగా సృజనాత్మక చర్చ, షేరింగ్ సెషన్‌ను సోమవారం కళాశాలలో నిర్వహించారు. ఈ సెషన్‌కు రిసోర్స్ పర్సన్‌గా యుఎస్ఎలోని వరిజీనియా టెక్ ట్రాన్స్‌పోర్టేషన్ ఇన్‌స్టిట్యూట్ రీసెర్చ్ సైంటిస్ట్ డాక్టర్ రాజారామ్ భగతుల వ్యహరించారు. హ్యూమన్ ఫ్యాక్టర్స్ ఇంజినీరింగ్ గురించి చర్చించారు. బి.టెక్ నుండి పిహెచ్‌డి వరకు తన ప్రయాణం, అనుభవాలను పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎం.వి.జి.ఆర్ ఇన్‌స్టిట్యూట్ ఇన్నోవేషన్ సెల్ కన్వీనర్ డాక్టర్ ప్రవీణ్ కల్లా, ఎఫ్.వై.ఎఫ్.పి కన్వీనర్, కె.ఎస్.ఎన్ రాజు, ఎఫ్.వై.ఎఫ్.పీ వాలంటీర్లు, సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

లింగ వివక్షతకు వ్యతిరేకంగా ర్యాలీ

డెంకాడ : మండల కేంద్రంలో సోమవారం లింగ ఆధారిత వివక్షతకు వ్యతిరేకంగా జాతీయ స్థాయి ప్రచారం కార్యక్రమంలో భాగంగా మండల స్థాయి వెలుగు ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ డిడి.స్వరూపారాణి మాట్లాడుతూ లింగ వివక్షతపై అవగాహన పెంచడానికే ఈ ర్యాలీ నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎపిఎం విజయలక్ష్మి, సిసిలు, మండల సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

బొబ్బిలి : పట్టణంలోని టిఆర్ కాలనీలో మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని సోమవారం మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణారావు పరిశీలించారు. మెనూ అమలుపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఉపాధ్యాయుల హాజరు పట్టికను పరిశీలించారు. నాడు-నేడు కార్యక్రమంలో చేపడుతున్న పనులను పరిశీలించి, సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సిహెచ్.రాజ్‌గోపాల్ నాయుడు, మున్సిపల్ మేనేజర్ శివప్రసాద్, ఆర్‌ఐ సురేష్‌బాబు పాల్గొన్నారు.

నేర్చుకున్న అంశాలు విద్యార్థులకు బోధించాలి

రేగిడి : శిక్షణలో నేర్చుకున్న విషయాలను పాఠశాల విద్యార్థులకు తప్పనిసరిగా బోధించాలని ఎంఇఒ ఎం. వరప్రసాదరావు అన్నారు. మండలంలో ఉంగరాడ మెట్ట డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకులంలో రేగిడి, వంగర, రాజాం మండలాల సబ్జెక్ట్ ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమం సోమవారంతో ముగిసింది. ఈ కార్యక్రమంలో ఎంఐఎస్ కోఆర్డినేటర్ కింబూరు శ్రీనివాసరావు, సిఆర్‌పిలు పాల్గొన్నారు.

అర్హులను గుర్తించాలి

గుర్ల : వైఎస్ఆర్ ఆసరా మూడవ విడతకు అర్హులైన లబ్ధిదారులను గుర్తించాలని వైఎస్ఆర్ క్రాంతి పథకం ఎపిఎం నారాయణరావు అన్నారు. సోమవారం ఐకెపి సమావేశ భవనంలో విఒఎ, సిసిలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో ఉన్న మహిళ పొదుపు సంఘాలు వాటి పనితీరును పరిశీలించాలన్నారు. ప్రతి సభ్యురాలు నుండి బయోమెట్రిక్ తీసుకోవాలని సిసికు సూచించారు. మండలంలో 1254 మహిళ పొదుపు సంఘాలలో 13,707 మంది సభ్యులు ఉన్నారన్నారు. డిసెంబర్ 10 నాటికి శతశాతం బయోమెట్రిక్ పూర్తి కావాలన్నారు.

పాఠశాల తనిఖీ

గరివిడి : మండలంలోని కోడూరు ప్రాథమిక పాఠశాలను కోడూరు డైట్ లెక్చరర్ ఎల్.రామకృష్ణ సందర్శించి తనిఖీ చేశారు. విద్యార్థుల ప్రమాణాలు, నోటీసులు, విద్యా ప్రగతిని తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాల ఆవరణలో ఉన్న అంగన్వాడి కేంద్రాన్ని సందర్శించి విద్యార్థులచే పాటలు పాడించారు. ఉపాధ్యాయులు డైరీలు లెసన్స్ ప్లాన్లను పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాలలో ప్రైవేటు పాఠశాలకు దీటుగా పనిచేస్తున్నాయని అయన కొనియాడారు. చదువుతో పాటుగా విద్యార్థులకు క్రమశిక్షణ నేర్పాలని ఆయన ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులకు మధ్యాహ్నం భోజనం విషయంలో ఎటువంటి లోటు లేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయులు ఎం. సూర్యనారాయణ. సిఆర్‌పి వరలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లంపిస్కిన్ నుంచి ఆవులను కాపాడాలని వినతి

విజయనగరం టౌన్ : నగరంలో ప్రస్తుతం ఆవులు లంపిస్కిన్ వ్యాధితో బాధపడుతున్నందున వాటిని కాపాడాలని టిడిపి నాయకులు సోమవారం కమిషనర్ శ్రీరాములునాయుడుకు వినతి అందజేశారు. ఈ సందర్భంగా టిడిపి నగర అధ్యక్ష కార్యదర్శులు ప్రసాదుల ప్రసాదరావు, కె.నర్సింగరావు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ కనకల మురళీమోహన్ మాట్లాడుతూ పశువులకు వచ్చే వ్యాధి ద్వారా చిన్నపిల్లలకు ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉన్నదని, ప్రజలకు కూడా సోకే ప్రమాదం ఉందని అన్నారు. వ్యాధి నివారణకు ఆవులకు సత్వరమే వ్యాక్సిన్ వేయాలని కోరారు.

పేదలకు ఆహార పొట్లాలు పంపిణీ

బొబ్బిలి : నేను సైతం స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో సోమవారం పేదలకు ఆహార పొట్లాలు పంపిణీ చేశారు. 267 వారాల నుంచి ఆహార పొట్లాలు పంపిణీ చేస్తున్నామని సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు బొంగు సంతోష్, లంక వాసుదేవరావు తెలిపారు.

ఇఎస్ఐ, పిఎఫ్ చెల్లించాలి : సిఐటియు

ప్రజాశక్తి- నెల్లిమర్ల

స్థానిక జ్యూట్ యాజమాన్యం పేరుకు పోయిన ఇఎస్ఐ, పిఎఫ్ బకాయిలు సంభంధిత శాఖలకు వెంటనే చెల్లించాలని సిఐటియు నాయకులు కిల్లంపల్లి రామారావు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక జ్యూట్ మిల్ గేటు వద్ద ఆయన గేటు మీటింగ్ నిర్వహించారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ యాజమాన్యం ఇఎస్ఐ, పిఎఫ్ బకాయిలు కట్టకపోవడం వల్ల రిటైర్డ్ కార్మికులు, ఉద్యోగులు తమకు రావాల్సిన పిఎఫ్ నగదు పొందలేక పోతున్నారని, పింఛన్ సౌకర్యం పొందలేక ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. 2016లో రిటైర్డ్ అయిన కార్మికులకు జ్యూట్ యాజమాన్యం చెక్కులు ఇచ్చింది గాని అకౌంట్‌లో నగదు లేక వారికి గ్రాడ్యుటీ బకాయిలు అందడం లేదన్నారు. యాజమాన్యం ఇచ్చిన గ్రాడ్యుటీ చెల్లింపు చెక్కులు ఈ నెలతో కాల పరిమితి దాటిపోయి చెక్కులు మరి చెల్లవు కాబట్టి అకౌంట్లో నగదు వేయాలని డిమాండ్ చేశారు. కాగా జ్యూట్ యాజమాన్యం కార్మికుల నుంచి అప్పుగా తీసుకున్న 5,10,18 రూపాయలు ఒక్కొక్క కార్మికుడికి రూ.58వేలు తిరిగి ఇవ్వకపోవడం దుర్మార్గమన్నారు. ఇప్పటికైనా యాజ మాన్యం వెంటనే స్పందించి ఇఎస్ఐ, పిఎఫ్ బకాయిలు చెల్లించడంతో బాటు, 2016 రిటైర్డ్ కార్మికులకు గ్రాడ్యుటీ చెల్లించాలని డిమాండ్ చేశారు. అలకాని పక్షంలో కార్మికులు, రిటైర్డ్ కార్మికులు, ఆందోళన చేస్తారని హెచ్చరించారు.

ఎస్‌పి స్పందనకు 40 అర్జీలు

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ఎస్‌పి దీపిక నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 40 అర్జీలు అందాయి. స్వీకరించిన ఫిర్యాదులపై తక్షణమే స్పందించి, సంబంధిత స్టేషన్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఏడు రోజుల్లో సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని, ఫిర్యాదులపై తీసుకున్న చర్యలను వెంటనే తనకు నివేదించాలని సూచించారు. కార్యక్రమంలో డిఎస్‌పి ఆర్.శ్రీనివాసరావు, డిసిఆర్‌బి సిఐ జె.మురళి, ఎస్‌బి సిఐలు రుద్రశేఖర్, జి.రాంబాబు, ఎస్ఐ వాసుదేవ్ పాల్గొన్నారు.

రామతీర్థం పూర్వ అర్చకునికి సన్మానం

ప్రజాశక్తి- నెల్లిమర్ల

రామతీర్థం రామస్వామి దేవస్థానం రిటైర్డ్ అర్చకులు సుదర్శనం రామ నరసింహాచార్యులుకు సోమవారం విజయనగరంలోని బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య ఆధ్వర్యంలో సన్మానం చేశారు. ఆలయంలో ప్రధానార్చకులుగా పనిచేసి పదవీ విరమణ పొందిన ఆయన దంపతులకు నూతన వస్త్రాలు, జ్ఞాపికలను అందచేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘ అధ్యక్ష కార్యదర్శులు, పండితులు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఆ కుళాయి కనెక్షన్లు తొలగించండి

కమిషనర్ శ్రీరాములు నాయుడు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నీటి పన్ను మొండిబకాయిదారుల కుళాయి కనెక్షన్లను తక్షణమే తొలగించాలని సంబంధిత కార్యదర్శులకు కమిషనర్ ఆర్.శ్రీరాములునాయుడు ఆదేశించారు. ఈ మేరకు సోమవారం 35, 38 నంబర్ సచివాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యదర్శులతో ఆయన మాట్లాడుతూ నీటి పన్ను వసూళ్ల లక్ష్యాన్ని శత శాతం పూర్తి చేయాలని ఆదేశించారు. జగనన్న కాలనీలో గృహ లబ్ధిదారులతో ఇళ్ల నిర్మాణ ప్రక్రియను వేగవంతం చేయాలని చెప్పారు. తడి, పొడి చెత్త సేకరించే సమయంలో చెత్త వర్గీకరణ తప్పనిసరిగా జరిగేలా కార్యదర్శులు బాధ్యత వహించాలన్నారు.

సమస్యలపై గ్రీన్ అంబాసిడర్ల వినతి

ప్రజాశక్తి-బాడంగి

గ్రీన్ అంబాసిడర్ల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు నాయకులు సురేష్ అధికారులను డిమాండ్ చేశారు. సోమవారం ఆయన ఆధ్వర్యాన గ్రీన్ అంబాసిడర్లు ఎంపిడిఒ కార్యాలయానికి ర్యాలీగా వెళ్లి, ఎంపిడిఒ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాణాలను ఫణంగా పెట్టి గ్రామాలను శుభ్రం చేస్తున్న గ్రీన్ అంబాసిడర్లకు నెల తరబడి జీతాలు చెల్లించకపోవడం దారుణమన్నారు. తక్షణమే వేతన బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

భోగాపురం : గ్రీన్ అంబాసిడర్లు పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి బర్రి సూర్యనారాయణ ఆధ్వర్యంలో సోమవారం భోగాపురం ఎంపిడిఒ బంగారయ్యకు వినతి పత్రం అందజేశారు. కనీస వేతనం అమలు చేయాలని, పిఎఫ్, ఇఎస్ఐ వంటి సౌకర్యాలు కల్పించాలని, పని భారం తగ్గించాలని బ్యాంకు ఖాతాల ద్వారా జీతాలు అందజేయాలని కోరారు. కార్మికులపై అధికారులు వేధింపులు ఆపాలని, ప్రతి నెల 5వ తేదీకి వేతనాలు అందేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న హమాలీలు, సిఐటియు నాయకులు

సమస్యలపై హమాలీల ధర్నా

ప్రజాశక్తి - నెల్లిమర్ల

ఎపి బెవరేజస్ హమాలీల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి బి. రమణ డిమాండ్ చేశారు. సోమవారం బేవరేజస్ హమాలీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో స్థానిక ఏపి బెవరేజేస్ డిపో వద్ద హమాలీలు ధర్నా నిర్వహించారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ హమాలీల ఎగుమతి కూలీ రేటు 7 నుంచి 10 రూపాయలకు పెంచాలని, గత నవంబర్ నుంచి ఎరియర్స్ చెల్లించాలని డిమాండ్ చేశారు. హమాలీల ఎగుమతి కూలీ రేట్లు ఏపిబిసిఎల్ అధికార్ల సమక్షంలో సిగ్మా కంపెనీతో చేసుకున్న ఒప్పందం గతేడాది అక్టోబర్‌లో ముగిసిందని తెలిపారు. కాగా ఎగుమతి కొట్టం కూలీ రేట్లు ఒప్పందం గత నవంబర్‌లో అమలు జరగాల్సి ఉన్నప్పటికీ ఇంతవరకు జరగలేదన్నారు. పెరిగిన ఇంటి అద్దెలు, వైద్య ఖర్చులు, పిల్లల చదువులు, పెరిగిన నిత్యాసర సరకుల ధరలకనుగుణంగా ఎగుమతి కూలీ రేట్లు పెంచాలని కోరుతూ గత అక్టోబర్ నుంచి పలుమార్లు ఏపిబిసిఎల్ కంపెనీ ఎండి, సిగ్మా కంపెనీ కాంట్రాక్టర్, రెవెన్యూ ప్రిన్సిపాల్ సెక్రటరీ, సంబంధిత మంత్రి, డిపో మేనేజర్‌కి వినతి పత్రాలు ఇచ్చామన్నారు. దీని ఫలితంగా ఈ ఏడాది జూన్‌లో హమాలీ సంఘంతో చర్చలు జరిగినప్పటికీ విఫలమయ్యాయని తెలిపారు. జూలై నుంచి సమ్మెకు సిద్ధమవ్వగా 3నెలలు వాయిదా వేయమని బాట్లింగ్ ఎండి కోరినట్లు చెప్పారు. ఈ నెల 21న జరిగిన చర్చల్లో మరింత గడువు ఎండి కోరారని తెలిపారు. వచ్చే నెల 10లోగా ఎగుమతి కూలీ రేట్లు పెంపు, ఏరియర్స్ చెల్లింపు వంటి సమస్యలు పరిష్కరించకపోతే సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో హమాలీ సంఘం నాయకులు ఎం.రామకృష్ణ, శ్రీను, ఎన్.అప్పలనాయుడు, పతివాడ బంగారప్పుడు, కె.శ్రీను, పి.త్రినాథ రావు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలుపై అవగాహన

గంట్యాడ.. మాట్లాడుతున్న ఎంపిపి పి.హైమావతి

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని కొండగంగుపూడి సచివాలయంలో ధాన్యం కొనుగోలుపై సోమవారం రైతులకు, సచివాలయ సిబ్బందికి అవగాహన సదస్సు ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఎంపిపి డి.సత్యవంతుడు మాట్లాడుతూ రైతు పండించిన ప్రతి ధాన్యపు గింజనూ రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రభుత్వం సేకరిస్తుందని చెప్పారు. ధాన్యం కొనుగోలు చేసిన 21 రోజుల్లో రైతుల ఖాతాల్లో నేరుగా డబ్బులు జమవుతాయని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఎ.యశ్వంత్ కుమార్, వైస్ ఎంపిపి అడపా ఈశ్వరరావు, వైసిపి జిల్లా నాయకులు ఎం.సత్యనారాయణ, మండల అధ్యక్షులు ఎం.జగన్నాథం, తహశీల్దార్ ఎస్.కృష్ణంరాజు, రైతు సంఘం జిల్లా నాయకులు సిహెచ్ జగన్, ఆర్ఎస్‌పేట సర్పంచ్ శర్మ పాల్గొన్నారు.

గంట్యాడ : ధాన్యం కొనుగోలు సమయంలో ప్రతిఒక్కరూ రైతులకు సహకరించాలని ఎంపిపి పీరుబండి హైమావతి అన్నారు. సోమవారం మండల కార్యాలయంలో ఏర్పాటు చేసిన మండల స్థాయి శిక్షణలో ఆమె మాట్లాడారు. మిల్లర్లతో సంబంధం లేకుండా ఆర్‌బికెల ద్వారా ధాన్యాన్ని కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. దీనిపై ప్రతి రైతుకు అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణానికి గ్రామస్థాయిలో సర్పంచులు, ఎంపిటిసిలు సహకరించి, నిర్మాణాలు వేగవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి వి.నరసింహమూర్తి, ఎంపిడిఒ భానోజీరావు, వ్యవసాయ శాఖ ఎడి నాగభూషణరావు, ఎఒ శ్యామ్‌కుమార్, డిప్యూటీ తహశీల్దార్ కె.స్వర్ణకుమార్, వైసిపి ఎస్‌సి సెల్ జిల్లా అధ్యక్షులు జైహింద్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు

రేగిడి : ధాన్యం రైతు భరోసా కేంద్రాల్లోనే కొనుగోలు చేసి, కేటాయించిన మిల్లర్ల వద్దకు పంపించే బాధ్యత వ్యవసాయ అసిస్టెంట్లదేనని తహశీల్దార్ టి.కళ్యాణ్ చక్రవర్తి, ఎంపిడిఒ జి.కాశీవిశ్వనాథరావు తెలిపారు. మండల రిసోర్స్ కార్యాలయంలో ప్రజాప్రతినిధులు, అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్లలో రైతుకు, మిల్లర్లకు ఎటువంటి సంబంధమూ లేదని తెలిపారు. మండలంలోని సోమరాజుపేట, కోడిస, అంబాడ వెంకటాపురం, కొండల మామిడివలస, పారంపేట రైస్‌మిల్లులు ధాన్యం కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకున్నామన్నారు. సమావేశంలో పిఎసిఎస్ అధ్యక్షులు నెల్లి పెంటంనాయుడు, ఎఒ మురళీకృష్ణ, ప్రజాప్రతినిధులు కెంబూరు వెంకటేశ్వరరావు, కె.శ్రీనివాసరావు, గోవిందరావు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచ్ రాజేశ్వరి

క్వారీలకు అనుమతులు తప్పనిసరి

ప్రజాశక్తి-వేపాడ

స్టోన్‌క్రషర్లు, క్వారీలకు పంచాయతీ అనుమతులు తప్పనిసరని, లేకుంటే చర్యలు తప్పవని సర్పంచ్ బీల రాజేశ్వరి హెచ్చరించారు. సోమవారం మండలంలోని వావిలపాడు పంచాయతీ పరిధిలో స్టోన్ క్రషర్లు, క్వారీ వ్యాపారాలు సాగిస్తున్న యాజమాన్య ప్రతినిధులతో కలిసి పంచాయతీ పాలకవర్గ సభ్యులు సచివాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రషర్, క్వారీ యజమానులు తప్పకుండా అన్ని రకాల అనుమతులు తీసుకోవాలని, లేకుంటే అధికారులకు నివేదించి చర్యలు తీసుకుంటామని చెప్పారు. క్వారీ లారీలతో దేవరాపల్లి, కొత్తవలస రహదారిపై భారీగా గుంతలు ఏర్పడ్డాయని, వాటిని బాగుచేయాలని, ప్రతిరోజూ నీటితో తడపాలని సూచించారు. వీటిపై సమావేశంలో తీర్మానించారు. సమావేశంలో పంచాయతీ కార్యదర్శి అప్పలనాయుడు, వైసిపి నాయకులు ఈర్ల సన్యాసినాయుడు, గండి శ్రీరామ్మూర్తి, బీల సతీష్, గొర్రిపాటి వెంకటరావు, నాగిరెడ్డి రాజునాయుడు, కె.శ్రీను, బూడి వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక పాఠశాల పరిశీలన

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని నీలకంఠ రాజపురంలోని ప్రాథమిక పాఠశాలను ఎంపిడిఒ బిఎస్‌కెఎన్ పట్నాయక్ సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన రికార్డులు పరిశీలించారు. విద్యార్థులకు ఇస్తున్న మెనూ సక్రమంగా అందుతున్నది, లేనిది పరిశీలించి, సంతృప్తి వ్యక్తంచేశారు. అనంతరం పాఠశాల వాతావరణం మరింత ఆహ్లాదకరంగా తయారు చేయాలని ఉపాధ్యాయులకు ఆయన సూచించారు. పిల్లలకు సులువుగా అర్థమయ్యే విధంగా విద్యా బోధన సాగించాలని తెలిపారు.

బానాదిలో ఫ్యామిలీ డాక్టర్

వేపాడ : మండలంలోని బానాది గ్రామంలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రోగులకు పిహెచ్‌సి వైద్యాధికారి ఎ.ధరణి, 104 వైద్యాధికారి వెంకటేష్ పరీక్షలు చేసి, మందులు అందజేశారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్ పి సునీత, లావణ్య, హెచ్ఎ సుధా నాయుడు, డిఇఒ కె.మోహన్, కె.సంతోష్, ఆశా వర్కర్లు లక్ష్మి, సూరమ్మ పాల్గొన్నారు.

ముగిసిన శిక్షణ

వేపాడ : ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు స్థానిక ఎంఆర్‌సిలో నిర్వహిస్తున్న తర్ల్ శిక్షణ సోమవారం ముగిసింది. శిక్షణలో అభ్యసన సామర్థ్యంపై అవగాహన కల్పించినట్లు ఎంఇఒ జి.శ్రీదేవి తెలిపారు.

మలుపుల వద్ద ప్లెక్సీల ఏర్పాటు

రేగిడి : మండలంలోని పాలకొండ- రాజాం ప్రధాన రహదారిపై తోకలవలస, రెడ్డి పేట తదితర మలుపుల వద్ద సోమవారం ఎస్ఐ ఇ.శ్రీనివాసరావు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ వాహనదారులు మలుపుల వద్ద వేగ నియంత్రణ చేసి నెమ్మదిగా వెళ్లాలన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

విజయనగరంటౌన్.. కరపత్రాలను పంపిణీ చేస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

ప్రజాశక్తి-కొత్తవలస

పార్టీలకతీతంగా అర్హత ఉన్న ప్రతిఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. కొత్తవలస మండలంలోని కాటకాపల్లి సచివాలయ పరిధిలో చినరావుపల్లిలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ ప్రభుత్వ పథకాలు అమలుపై ఆరాతీశారు. ప్రతీ గడపలో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కుల, మత, పార్టీలకు అతీతంగా సంక్షేమ పాలన అందిస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో ఎల్.కోట ఎంపిపి గేదెల శ్రీనివాసరావు, వైసిపి మండల అధ్యక్షులు ఒబ్బిన నాయుడు, పి.ఎస్.ఎన్ పాత్రుడు, బొదల సురేష్, పెనగంటి చెల్లయ్య, సర్పంచ్ బూసాల దేముడు, సింగపల్లి వాసు, బూసాల రామకృష్ణ, మిడతాన వెంకటరావు, అడిగర్ల సంతోష్, చిన్నంనాయుడు, భీమాలి సర్పంచ్ కొయ్యాన కృష్ణ, మిడతాన గణేష్, ఎంపిటిసి శ్రీనురాజు, నిమ్మలపాలెం శ్రీను, ముసిరాం పైడినాయుడు, యువజన విభాగం మండల అధ్యక్షులు ఐతంశెట్టి అనిల్, దేవాడ రమణ, చీపురువలస సూరిబాబు, వెంకన్న పాత్రుడు పాల్గొన్నారు.

32వ డివిజన్‌లో గడపగడపకు..

విజయనగరంటౌన్ : నగరంలోని 32 డివిజన్ తోటపాలెం నరసింహనగర్‌లో సోమవారం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాల అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. స్థానికులు సమస్యలను ప్రస్తావించగా, వాటి పరిష్కారానికి కృషి చేస్తామని హామీనిచ్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్ భోగాపురపు లక్ష్మి, వైసిపి జోనల్ ఇన్‌ఛార్జి రెడ్డి గురుమూర్తి, నాయకులు భోగాపురపు రవిచంద్ర, కార్పొరేషన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



కొత్తవలస.. కరపత్రాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

క్షయరోగులకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి-విజయనగరం రూరల్

మండలంలోని కొండకరకాంలో సోమవారం క్షయ రోగులకు క్షయ ముక్త భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా నలుగురు రోగులకు సర్పంచ్ కిలారి రాంబాబు, ఎంపిటిసి భోగాపురపు ఆదినారాయణ ఆధ్వర్యాన ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నలుగురు క్షయ రోగులను దత్తత తీసుకున్నట్లు తెలిపారు. వారికి ఆర్థిక సాయంతో పాటు పోషకాహారం అందజేశారు. కార్యక్రమంలో క్షయ నివారణ కార్యాలయం హెల్త్ సూపర్‌వైజర్ జి.పైడిరాజు, సూపర్‌వైజర్ ఎ.వీరస్వామి, పంచాయతీ కార్యదర్శి వివి అనురాధ, ఎంఎల్‌హెచ్‌పి ఎం జి.మౌనిక, ఎఎన్ఎం కె.లక్ష్మి, ఆశావర్కర్లు, వాలంటీర్లు పాల్గొన్నారు.



ఆర్థిక సాయం అందిస్తున్న రాంబాబు, ఆదినారాయణ

పాత డీలర్‌కు బాధ్యతలు ఇవ్వొద్దు

ప్రజాశక్తి-బొబ్బిలి

మండలంలోని గున్నతోటవలస పాత రేషన్ డీలర్‌కు తిరిగి బాధ్యతలు అప్పగించవద్దని గ్రామస్తులు ఆర్‌డిఒ పి.శేషశైలజకు స్పందనలో సోమవారం ఫిర్యాదు చేశారు. గతంలో రేషన్ డీలర్ అక్రమాలకు పాల్పడటంతో అధికారులు సస్పెండ్ చేశారని గుర్తుచేశారు. తిరిగి పాత డీలర్‌కు బాధ్యతలు అప్పగిస్తే అక్రమాలకు పాల్పడే అవకాశం ఉందని ఆరోపించారు. కొత్తగా డీలర్‌ను నియమించాలని కోరారు. దీనిపై ఆర్‌డిఒ స్పందిస్తూ డీలర్ బాధ్యతలు అప్పగించాలని కోర్టు నుంచి ఉత్తర్వులు వచ్చాయని, మళ్లీ అక్రమాలకు పాల్పడితే ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కోర్టు ఉత్తర్వులను అమలు చేయాలని చెప్పారు.

నేల బావిలో జారిపడి మహిళ మృతి

ప్రజాశక్తి-రామభద్రపురం

మండల పరిధిలోని దుప్పలపూడి గ్రామానికి చెందిన శీర పార్వతి(51) పొలానికి వెళ్తూ మార్గమధ్యలో ప్రమాదవశాత్తు నేల బావిలో జారి పడి సోమవారం మృతి చెందింది. ఆమె భర్త శీర కృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సురేంద్రనాయుడు తెలిపారు. ఆదివారం పార్వతీ తన తోటికోడలు చిట్టెమ్మతో కలిసి వరి చేను కోతకు వెళుతుండగా, మార్గమధ్యలో నేల బావిలో పడిపోయింది. వెంటనే చిట్టమ్మ కేకలు వేయడంతో శీర వేణు, గొట్టాపు నాయుడు తదితరులు వచ్చి బావిలో దిగి ఆమెను బయటకు తీశారు. వెంటనే 108 వాహనంలో విజయనగరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, అక్కడనుంచి మెరుగైన వైద్యం కోసం తిరుమల- మెడికవర్ ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది.